శిథిలావస్థకు చేరువలో..

- అధ్వానంగా తాగునీటి ట్యాంకులు
- ఇనుప చువ్వలు తేలి ప్రమాదకరంగా మారిన పిల్లర్
- ఆందోళన చెందుతున్న ప్రజలు


రాంపురంలో ఇనుప చువ్వలు తేలిన పిల్లరు

పెబ్బేరు రూరల్: మండలంలోని తాగునీటి ట్యాంకులు పెచ్చులూడుతూ ప్రమాదకరంగా తయారవుతున్నాయి. అంతేకాకుండా కొన్ని ట్యాంకులకు పిల్లర్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. మరికొన్ని చోట్ల ట్యాంకుల అడుగు భాగాన ఇనుప చువ్వలు తేలడంతో ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. సంబంధిత ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. మండలంలోని కొత్తసూగూరు, రాంపురం గ్రామాల్లో తెలుగు వాడ, ఎస్సీ వాడలో 26 ఏళ్ల కిందట 40 వేల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంకులు నిర్మించారు. వాటి నిర్వహణను పట్టించుకునేవారు లేక పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ట్యాంకుల మరమ్మతు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


రాంపురంలో ఇనుప చువ్వలు తేలి ప్రమాదకరంగా మారిన ట్యాంక్


కొత్తసూగూరులో శిథిలావస్థలో ట్యాంక్

ఎస్సీ కాలనీలో..

రాంపురం గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఉన్న తాగునీటి ట్యాంకు అడుగు భాగాన, పిల్లర్లకు సీకులు తేలి పెచ్చులూడుతున్నాయి. దీంతో ట్యాంకు సమీప ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు వెంటనే ట్యాంకుకు మరమ్మతు చేయాలి.

– ఎంకే మూర్తి, రాంపురం

26 ఏళ్ల కిందట..

సూగూరు ఉమ్మడి గ్రామంలో 26 ఏళ్ల కిందట 40 వేల సామర్థ్యం గల తాగునీటి ట్యాంకు నిర్మించారు. అది ఇప్పుడు పిల్లర్లు, అడుగు భాగం సీకులు తేలి ప్రమాదకరంగా మారింది. ప్రమాదం జరగక ముందే ట్యాంకు మరమ్మతు చేయించే విధంగా చర్యలు తీసుకోవాలి.

– ఎస్ అంజత్, కొత్తసూగూరు

క్లుప్తంగా

ఉద్యోగులకు పదవీ విరమణ తప్పనిసరి



పెబ్బేరు రూరల్: మండలంలోని రంగాపురం ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా సేవలు అందించిన సత్యనారాయణ పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా సోమవారం పాఠశాలలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ జయరాం మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ అనేది తప్పసరి అన్నారు. పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా సత్యనారాయణకు ఎంఈఓ, ఉపాధ్యాయులు శాలువా, పూలమాలలతో సన్మానం చేశారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, భాస్కర్, వేణాచారి, నరేందర్‌గౌడ్, సురేందర్‌గౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చింతలయ్య ఆశయాలను కొనసాగిద్దాం



అమరచింత: బీడీ కార్మికుల హక్కుల కోసం పోరాడిన చింతలయ్య ఆశయాలను రక్షించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం కోరారు. చింతలయ్య వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో చింతలయ్య స్తూపం వద్ద పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా సూర్యం మాట్లాడుతూ ప్రజా పక్షాన వారి సమస్యల పరిష్కారంతో పాటు ఈ ప్రాంత బీడీ కార్మికుల తరపున యాజమాన్యంతో వేతన ఒప్పందాల కోసం పోరాడిన కార్మిక నాయకుడన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ హనుమంతు, రాజు, రాజన్న, ప్రేమరత్నం, సామేలు, కురుమన్న తదితరులు పాల్గొన్నారు.

శివరామాంజనేయ ఉత్సవాలు



పాన్‌గల్: మండలంలోని అన్నారం శివరామాంజనేయ ఆలయ మహోత్సవం వేడుకలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ మహోత్సవాల్లో మొదటి రోజు మహాగణపతి పూజ, హోమాలు, జలాధివాసం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఉత్సవాలకు హాజరైన భక్తులకు అన్నదానం, నీటి వసతిని నిర్వాహకులు ఏర్పాటు చేశారు.

సెల్‌ఫోన్ అప్పగింత



ఆత్మకూర్: నూతనంగా వచ్చిన సీఈఐఆర్ పోర్టల్ ద్వారా చోరీకి గురయిన సెల్‌ఫోన్‌ను రికవరీ చేసి సోమవారం బాధితుడికి అప్పగించినట్లు ఎస్‌ఐ నరేందర్ తెలిపారు. ఆత్మకూర్ మండలంలోని మోట్లంపల్లికి చెందిన నాగన్న మార్చి 27వ తేదీన ఆత్మకూర్ నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా సెల్‌ఫోన్ పడిపోయింది. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్ ఆచూకీని కనుక్కొని రికవరీ చేసినట్లు తెలిపారు. సెల్‌ఫోన్లు చోరీకి గురయిన, లేదా పోగొట్టుకున్న సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వివరాలను పొందుపర్చాలని సూచించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పాన్‌గల్: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ వేణు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మాందాపూర్ గ్రామానికి చెందిన దిండి రాంచంద్రయ్య(56) కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్న ఇతడు కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఆదివారం రోజు ఇంట్లో ఎవరూ లేని సమయంలో మనస్తాపంతో ఇంట్లో ఉన్న పాత పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నానికి ప్రయత్నించాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించగా డాక్టర్ల సూచన మేరకు మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతురాలి కోడలు రజిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

రైతులకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత


కాల్వ మరమ్మతు పనులు పరిశీలిస్తున్న ఏపీఓ కుర్మయ్య

పాన్‌గల్: ఉపాధి హామీ పథకంలో రైతులకు ఉపయోగపడే పనులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఏపీఓ కుర్మయ్య అన్నారు. సోమవారం మండలంలోని దావాజిపల్లిలో కేఎల్‌ఐ కాల్వ మరమ్మతు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సాగునీటి కాల్వలు, చెరువులో పూడికతీత, కుంట కట్టల వంటి మరమ్మతు పనులకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. తీవ్రమైన ఎండలతో ఉపాధి కూలీలు అప్రమత్తంగా ఉండాలని, పనులకు ఉదయం వేళల్లో తొందరగా వెళ్లి మధ్యాహ్నం త్వరగా వచ్చేలా చూడాలని ఆయన సిబ్బందికి సూచించారు. పనుల వద్ద కూలీలకు ఇబ్బందులు కలుగకుండా నీడ, నీటి వసతి తప్పక ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ గోపాల్‌గౌడ్ పాల్గొన్నారు.

పూర్వ ప్రాథమిక విద్య దినోత్సవం


కనిమెట్టలో చిన్నారుల పురోగతి చూపిస్తున్న టీచర్లు

కొత్తకోట రూరల్: మండలంలోని కనిమెట్ట అంగన్‌వాడీ కేంద్రం–1లో సోమవారం పూర్వ ప్రాథమిక విద్య దినోత్సవాన్ని అంగన్‌వాడీ టీచర్ తిరుమలేశ్వరి విద్యార్థులతో ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారుల చదువుకు సంబంధించిన వివరాలను వారి తల్లిదండ్రులకు అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారులు ఆటపాటలతో అలరించారు. తమ పిల్లలకు చదువుతో పాటు మంచి ఆట, పాటలు నేర్పించిన అంగన్‌వాడీ టీచర్ తిరుమలేశ్వరిని చిన్నారుల తల్లిదండ్రులు అభినందించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం లక్ష్మయ్య, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, ఉపాధ్యాయ బృందం శ్రీనివాసులు, సుభాషిణి, ధర్మాదేవి, సునిత, సుజాత, అంగన్‌వాడీ ఆయా మన్నెమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని 3, 5వ సెంటర్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం పిల్లల అభ్యున్నతి మైలురాయి అను అంశంపై తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బాలీశ్వరీ, పంచాయతీ కార్యదర్శి నందకిషోర్ పాల్గొని మాట్లాడుతూ అంగన్‌వాడీలో పిల్లలను చేర్పించాలని, ప్రైవేట్ స్కూల్‌కు దీటుగా అంగన్‌వాడీలు పనిచేస్తున్నాయని తల్లిదండ్రులకు సూచించారు. పిల్లల అభివృద్ధి ప్రాగ్రెస్ కార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మంజులరాణి, శాంతాబాయి, కైసర్‌బేగం, రాధ, కవిత, ఆయాలు పాల్గొన్నారు.

హనుమాన్ మాలధారణ ప్రారంభం


హనుమాన్ దీక్షను స్వీకరించిన మాలధారులు

వనపర్తి టౌన్: మండల కాలం పాటు కఠిన నియమాలతో ఆచరించే హనుమాన్ దీక్ష సోమవారం జిల్లా కేంద్రంలోని చింతల హనుమాన్ ఆలయంలో మొదలయింది. ప్రతి ఏటా హనుమాన్ జయంతి రోజున పెద్ద ఎత్తున భక్తులు మాలాధారణ చేస్తారు. ఒక రోజు ముందుగానే 24మంది భక్తులు చింతల హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మాల ధరించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు శంకర్‌సింగ్ మాట్లాడుతూ.. పాదరక్షలు లేకుండా మండుటెండలో హనుమాన్ దీక్షను భక్తులు ఆనందంగా స్వీకరిస్తారని చెప్పారు. వేకువజామున, సాయంత్రం రెండు పూటల స్నానం చేసి ఒకే పూట మధ్యాహ్న బిక్షను స్వీకరించాలని, రాత్రి పూట అల్పాహారం మితంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు రాఘవేందర్, ఆలయ సూపర్‌వైజర్ రంగరాజు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

పెబ్బేరు రూరల్: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పసుపుల బలరాం మృతి చెందడం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. సోమవారం ఆయన వనపర్తి మండలంలోని కడుకుంట్లకు చెందిన పసుపుల బలరాం మృతి చెందిన విషయం చిన్నారెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందించారు.

చిన్ననాటి స్నేహితుడికి చేయూత



పెబ్బేరు రూరల్: వనపర్తిలోని చిమనగుంటపల్లిలో అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి చిన్ననాటి మిత్రులు అండగా నిలిచారు. పెద్దమందడి మండలం బలిజపల్లి, జంగమాయపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో 2000–01 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న చిమనగుంటపల్లి గ్రామానికి చెందిన గోవర్ధన్‌కు పెరాలసిస్ వచ్చి ఎడమ చేయి, ఎడమ కాలు పనిచేయటం లేదు. విషయం తెలుసుకున్న పదో తరగతి మిత్రులు అందరూ కలిసి తమ వంతుగా రూ.40వేలు జమచేసి బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్ ఏ అవసరం వచ్చినా మిత్రుడికి అండగా ఉంటామని భరోసానిచ్చారు.

అత్త, మామలపై కేసు నమోదు

అమరచింత: మండలంలోని నందిమళ్ల గ్రామానికి చెందిన కళ్యాణి అనే వివాహిత తనను అదనపు కట్నం తీసుకురమ్మంటూ తమ అత్త, మామలు వేధిస్తున్నారని ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ సురేష్‌కుమార్ తెలిపారు. నందిమళ్ల గ్రామానికి చెందిన రేణుక, పరశురాం దంపతులకు వారి కోడలు కళ్యాణితో ప్రతినిత్యం కట్నం విషయంలో వాగ్వాదం జరిగేదని ఎస్‌ఐ తెలిపారు. ఈక్రమంలో ఆదివారం రాత్రి అదనపు కట్నం వ్యవహారంలో తనను మరింతగా వేధించారని కళ్యాణి సోమవారం ఫిర్యాదు చేసిందన్నారు. కోడలి ఫిర్యాదు మేరకు అత్త, మామలపై కేసు నమోదు చేసి విచారిస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేస్తా

- నాగర్‌కర్నూల్ బీజేపీ ఎంపీ అభ్యర్థి భరత్ ప్రసాద్


పెద్దమందడిలో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్

కొత్తకోట రూరల్: తనకు ఒక్క అవకాశమిస్తే.. అభివృద్ధి చేసి చూపిస్తానని నాగర్‌కర్నూల్ బీజేపీ ఎంపీ అభ్యర్థి పి.భరత్‌ప్రసాద్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం పెద్దమందడిలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. మండల కేంద్రంలోని ప్రధాన వీధుల్లో తిరుగుతూ బీజేపీకి ఓటువేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రధాని మోదీ భారతదేశాన్ని అగ్రస్థానంలో నిలిపారని, 140 కోట్ల మందిని సొంత కుటుంబ సభ్యులుగా భావిస్తూ నిరంతరం వారి సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్నారన్నారు. భారత్‌కు ప్రపంచ దేశాల్లో గుర్తింపు తీసుకొచ్చిన ఘనత మోదీకే దక్కిందని.. అలాంటి వ్యక్తిని మరోసారి ప్రధానిని చేద్దామని కోరారు. తనను ఆశీర్వదించి పార్లమెంట్‌కు పంపిస్తే పార్లమెంట్ నియోజవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు తీసుకొస్తానని తెలిపారు. ఆయన వెంట పార్టీ జిల్లా అధ్యక్షుడు నారాయణ, జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎస్.వెంకట్‌రెడ్డి, తిరుపతయ్య, పురుషోత్తంరెడ్డి, కె.శివారెడ్డి, చెన్నయ్య, అశ్వినీ రాధా, లక్ష్మీకాంత్‌రెడ్డి, శంకర్‌గౌడ్, నందకుమార్, పెద్దిరాజు, విఠల్‌రెడ్డి, విష్ణు, జి.వెంకటేష్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు అభినందన


విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని దళితవాడ గాం. దీనగర్ ప్రాథమిక పాఠశాలకు చెందిన 9 మంది విద్యార్థులు గురుకులలో సీట్లు సాధించారు. ప్రభుత్వ పాఠశాలలో అత్యధికంగా సీట్లు సాధించడంపై హెచ్‌ఎం సంధ్యారాణి, ఉపాధ్యాయులు అశోక్‌కుమార్, రాధ సోమవారం హర్షం వ్యక్తం చేస్తూ పాఠశాలలో విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గురుకుల సీట్ల పేరుతో కొన్ని ప్రైవేట్ కోచింగ్ సెంటర్లు నిరుపేద విద్యార్థులతో కాసులు కాజేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు గీతికశ్రీ, శరణ్య, సుప్రియ, నందన అఖిర, హేమంత్, చైతన్య, చత్రిక, సాహిత్య, మీనాక్షి గురుకుల సీట్లు సాధించినట్లు పేర్కొన్నారు.

కార్మిక వ్యతిరేక శక్తులను ఓడించాలి


మాట్లాడుతున్న జయలక్ష్మి

పెబ్బేరు రూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో కార్మిక వ్యతిరేక, మతోన్మాద పార్టీ బీజేపీని ఓడించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జయలక్ష్మి కోరారు. సోమవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని యాదవ భవనంలో కార్మిక వర్గ కర్తవ్యం అనే అంశంపై సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ కార్మిక వర్గంపై బీజేపీ పదేళ్లుగా అలసత్వం వహిస్తుందని, వారిని గద్దె దించాలని పిలుపునిచ్చారు. వామపక్ష లౌకిక శక్తులను బలపర్చాలని, ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్, సునీత, రమేష్, రాములు, వెంకటేశ్వరమ్మ, నాగేంద్రమ్మ, పుష్ప, లక్ష్మయ్య, చంద్రమ్మ, మద్దిలేటి, మదన్, గంధం గట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఓఈ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ

అమరచింత: ఫిబ్రవరి 25 వ తేదీన నిర్వహించిన టీఎస్ ఆర్‌జేసీ సీఓఈ కళాశాలకు ఎంపిక పరీక్షలో అమరచింతకు చెందిన తస్లీమ్, హారిక ఎంపికయ్యారని ఎస్‌ఆర్ కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు సయ్యద్ రాజీక్ తెలిపారు. సరూర్‌నగర్‌లోని సీఓఈ గురుకుల కళాశాలకు హారిక, ఫలక్‌నుమా సీఓఈ గురుకుల కళాశాలకు తస్లీమ్ ఎంపికయ్యారు. ఇద్దరు విద్యార్థినులు స్థానిక జెడ్పీఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ మీడియం చదువుతూ సయ్యద్ రాజీక్ నిర్వహించే ఉచిత కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందారు. విద్యార్థినీల ఎంపిక పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బీఆర్‌ఎస్‌తోనే రైతులకు మేలు


తాటిపాములలో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఖిల్లాఘనపురం: బీఆర్‌ఎస్‌తోనే రైతులకు, పేదలకు న్యాయం జరుగుతుందని ఎంపీపీ కృష్ణానాయక్, మండల ఇన్‌చార్జ్ నందిమల్ల అశోక్, జెడ్పీటీసీ సభ్యుడు సామ్యనాయక్, మండల పార్టీ అధ్యక్షుడు రాళ్లకృష్ణయ్య అన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతూ సోమవారం వారు మండలంలోని పర్వతాపురం, సల్కెలాపురం, అప్పారెడ్డిపల్లిలో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తప్పుడు వాగ్దానాలు చేసి ప్రజలను మోసగించి అధికారంలోకి వచ్చిందని దుయ్యబట్టారు. 100 రోజుల్లో 6 గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పి 5 నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు వాటి ఊసేత్తట్లేదని ఎద్దేవా చేశారు. విద్యావంతుడు పేదల బాధలు తెలిసిన ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను గెలిపిస్తే పంపితే ఈ ప్రాంతంలోని సమస్యలను పార్లమెంటులో ప్రస్తావించి పరిష్కరించేందుకు అవకాశం ఉందన్నారు. ఉద్యోగాన్ని సైతం లెక్క చేయకుండా పేదలకు సేవచేయాలనే ఉద్దేశ్యంతో ఎంపీగా బరిలోకి దిగాడన్నారు. కార్యక్రమంలో మన్నెంగౌడ్, అంజనేయులు గౌడు, మాజీ సర్పంచులు నిర్మలాసుదర్శన్, కృష్ణవేణి, సుదర్శన్, నాగిరెడ్డి, మల్లారెడ్డి, శంకర్‌గౌడు, చెన్నయ్య, బాలస్వామి, మల్లేష్‌గౌడు, బాలయ్య, రాములు, వెంకటేష్, తార్యనాయక్, బాగన్న, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సల్కెలాపురంలో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

పెబ్బేరు రూరల్: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని సోమవారం శ్రీరంగాపురం మండలంలోని తాటిపాములలో బీఆర్‌ఎస్ జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, స్థానిక నాయకులతో కలిసి ఉపాధి పనుల వద్ద కూలీలకు, చేపలు పడుతున్న మత్స్యకారుల వద్దకు వెళ్లి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హామీలు అమలు పరచని కాంగ్రెస్ పార్టీకి కర్రు కాల్చి వాతపెట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటస్వామి, విండో చైర్మన్ జగన్నాథంనాయుడు, మాజీ సర్పంచ్ సత్యంయాదవ్, వెంకటేశ్వర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ఆరీఫ్, కురుమన్న తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి


డీడబ్ల్యూఓకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

పెబ్బేరు రూరల్: ఆత్మకూర్ ప్రాజెక్ట్‌లోని కొత్తకోట, మదనాపురం, అమడబాకుల, సెక్టార్లలో పనిచేస్తున్న అంగన్‌వాడీ హెల్పర్లకు 2021 ఆగస్టు నుంచి డిసెంబర్ వరకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ డీడబ్ల్యూఓ లక్ష్మీబాయికి సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.జయలక్ష్మి మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే అంగన్‌వాడీ హెల్పర్లలో ఏడుగురికి ఐదు నెలల వేతనాలు, మరో ఇద్దరికి ఏడాది పాటు వేతనాలు ఇవ్వకపోవడం దారుణమని వాపోయారు. వారికి వెంటనే అధ/కారులు వేతనాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిల్లావ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. హెల్పర్లు ఆత్మకూర్ సీడీపీఓకు, సూపర్‌వైజర్లకు పలుమార్లు పెండింగ్ వేతనాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేసినా ప్రయోజనం లేకుండా పోయిందని, పెండింగ్ వేతనాలు ఇవ్వడంలో కాలయాపన చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షులు నిక్సన్, హెల్పర్లు గాయత్రి, అరుణ, శిరీష, మహేశ్వరి, మనిషా, రాజేశ్వరి, డి.మహేశ్వరి తదితరులు ఉన్నారు.

అభివృద్ధి చూసే కాంగ్రెస్‌లో చేరికలు


కాంగ్రెస్‌లో చేరిన నాయకులతో ఎమ్మెల్యే మేఘారెడ్డి


కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

గోపాల్‌పేట: బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ప్రజలంతా మోసపోయారని, కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి చూసే అందరూ కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని జాంప్లతండా, బుద్దారం గ్రామాలకు చెందిన ఎంపీటీసీ విష్ణు శ్రీదేవి, మాజీ సర్పంజ్, వార్డు మాజీ సభ్యులతో పాటు 150 మందికి పార్టీ కండువాలు వేసి కాంగ్రెస్‌లో చేర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తల్లి లాంటిదని, ఇందిరమ్మ కాలం నుంచి నిరుపేదలైన గిరిజనుల అభివృద్ధి కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారని కొనియాడారు. బుద్దారం రిజర్వాయర్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతుల వివరాలను ఇప్పటికే ముఖ్యమంత్రికి అందించామని చెప్పారు. ఎవ్వరికీ ఇబ్బంది కలగకుండా రిజర్వాయర్ నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. బుద్దారం అనుబంధ తండాలతో పాటు అందరికీ అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి మండల ఇన్‌చార్జ్ సత్యశీలారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పర్వతాలు, నాయకులు జాంప్లనాయక్, చంద్రయ్య, పెంటారావు, కోటిరెడ్డి, కోదండం, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: మండలంలోని నిర్వేన్, రామనంతాపూర్ గ్రామాల ఎంపీటీసీ పద్మమ్మతో పాటు 50మంది బీఆర్‌ఎస్ కార్యకర్తలు, పాలెం గ్రామానికి చెందిన 25మంది బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం ఎమ్మెల్యే జి మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో ఉందని, కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందనే దీమాతోనే వివిధ పార్టీలకు చెందిన వారు కాంగ్రెస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చల్లా వంశీదర్‌రెడ్డి గెలుపు కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పి.కృష్ణారెడ్డి, భీంరెడ్డి, బీచుపల్లి యాదవ్, శేఖర్‌రెడ్డి, విశ్వనాథం, మాజీ సర్పంచ్ బాలరాజు, గౌతం, కిషోర్, కిరణ్, బుచ్చిరెడ్డి, వెంకటన్నగౌడ్, మైబు, రాంచందర్ ఉన్నారు.